# అట్టహాసంగా సీఎం ప్రమాణ స్వీకారం

- ట్రాఫిక్‌లో చిక్కుకున్న ప్రముఖులు
- రద్దీతో ఇబ్బందులు పడ్డ సామాన్యులు
- రద్దీని అంచనా వేయలేక చేతులెత్తేసిన పోలీసులు

సిటీబ్యూరో, డిసెంబర్ 7(నమస్తే తెలంగాణ): రాష్ట్ర ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి గురువారం ఎల్బీ స్టేడియంలో చేసిన ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు భారీ సంఖ్యలో తరలి వచ్చారు. ఎక్కడికక్కడ ట్రాఫిక్ రద్దీ ఏర్పడి ప్రమాణ స్వీకారానికి హాజరు కావాల్సిన ముఖ్య అతిథులు ట్రాఫిక్‌లో చిక్కుకున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌తో పాటు సోనియాగాంధీ, రాహుల్, ప్రియాంకకు కూడా ట్రాఫిక్ చిక్కులు తప్పలేదు. వీళ్ల కన్వాయ్ ఎల్బీ స్టేడియం వెళ్తుండ డంతో రవీంద్ర భారతి చౌరస్తా నుంచి ఎల్బీస్టేడియం వరకు రూట్ క్లియర్ చేయలేక ట్రాఫిక్ పోలీసులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇదే సమయంలో ఎల్బీ స్టేడియానికి కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌లు వస్తూ ట్రాఫిక్‌లో చిక్కుకున్నారు. చివరకు ట్రాఫిక్ ముందుకు కదలకపోవడంతో చేసేది లేక సిద్దరామయ్య, డీకే శివకుమార్ నడుచుకుంటూ స్టేడియంలోని ప్రమాణ స్వీకార ప్రాంగణానికి వెళ్లారు. గవర్నర్ కన్వాయ్‌కి కూడా ట్రాఫిక్ తిప్పలు తప్పలేదు. ట్రాఫిక్ పోలీసులు ముందస్తుగానే స్టేడియం పరిసరాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధించినా ఎక్కడి ట్రాఫిక్ అక్కడా జామ్ కావడంతో సాధారణ పౌరులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.




ప్రధాన మార్గంలో ట్రాఫిక్ రద్దీ..

## అంచనా వేయలేక.. చేతులెత్తేసిన పోలీసులు

ఎల్బీస్టేడియంలో ప్రముఖులు ఏర్పాటు చేసే కార్యక్రమాల సందర్భంగా ట్రాఫిక్ పోలీసులు ఆ కార్యక్రమానికి ఎంత మంది వస్తారు.. వారికి కావాల్సిన పార్కింగ్ ఏర్పాట్లు, ఎక్కడ వాహనాలు ఆగాలి, ఎక్కడ నిలపాలి అనే విషయాలను వివరించడంతో పాటు పక్కా ప్లాన్ చేస్తారు. కానీ ఈ సారి కొత్త ప్రభుత్వం కొలువు తీరనుండడంతో రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు భారీ సంఖ్యలో హాజరవుతారని అంచనా వేయలేకపోయారు. దీంతో పాటు కొత్త ప్రభుత్వంలో కొలువు తీరే వారి గురించి ఎక్కువగా తెలియకపోవడంతో పోలీసులు భారీ సంఖ్యలో వాహనాలు జిల్లాల నుంచి వస్తాయని అంచనా వేయడంలో లెక్క తప్పారు. జిల్లాల నుంచి వచ్చే వారు ఎక్కువగా బస్సుల్లో వస్తుంటారు. కానీ ఈ సారి ఎక్కువ మంది కార్లనే ఎంచుకున్నారు. వచ్చిన వారంతా స్టేడియానికి ఇరువైపులా ఉన్న రూట్లలో ఒక పక్కకు పార్కు చేశారు. సాధారణ ట్రాఫిక్‌ను మళ్లించినా ఏఆర్ పెట్రోల్ బంక్ వద్ద ఇరువైపులా రాకపోకలకు సంబంధించిన వాహనాలను మళ్లింపు చేపట్టారు. సాధారణ ట్రాఫిక్ ఈ రూట్‌లో నుంచి రాకపోకలు సాగించడం, వీవీఐపీల మూమెంట్‌తో పాటు స్టేడియానికి తరలివచ్చే వాహనాలతో స్టేడియం పరిసరాలన్నీ భారీగా నిండిపోయాయి. దీంతో పరిస్థితి చేయి దాటిపోవడంతో ట్రాఫిక్ పోలీసులు కూడా చేతులెత్తేశారు. ఇదిలాఉండగా సాయంత్రం పాఠశాలల నుంచి తమ ఇండ్లకు వెళ్లే విద్యార్థులకు సైతం ట్రాఫిక్ ఇబ్బందులు తప్పలేదు. బషీర్‌బాగ్ చౌరస్తా, ఏఆర్ పెట్రోల్ బంక్, రవీంద్ర భారతి, లక్డీకాపూల్ చౌరస్తాలో దాటేందుకు గంటల సమయంపాటు వాహనదారులు ట్రాఫిక్‌లోనే ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. సాయంత్రానికి ట్రాఫిక్ రద్దీ తగ్గి యథాస్థితికి వచ్చింది.

## ప్రధాన రోడ్లన్నీ రద్దీ

తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ప్రమాణ స్వీకారోత్సవం వాహనదారులకు ఇబ్బందులు తప్పలేదు. సిటీ మధ్యలో ఉండే ఎల్బీ స్టేడియంలో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సమావేశంతో రోడ్లన్నీ వాహనాలతో నిండిపోయాయి. మధ్యాహ్నం ఒంటి గంటకు కార్యక్రమమైతే... ఉదయం నుంచే నగరంలోని ఖైరతాబాద్ మార్గం, సోమాజిగూడ నుంచి రవీంద్రభారతి మీదుగా ఎల్బీ స్టేడియం మీదుగా ట్రాఫిక్ సాగింది. ఉదయం 9గంటల నుంచి ప్రముఖ రాకపోకలు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేతలు నగరానికి చేరుకోవడంతోనే ట్రాఫిక్ మొదలైంది. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 4గంటల వరకు ఎల్బీ స్టేడియం చుట్టూ ఉన్న 3 కిలోమీటర్ల పరిధిలో ఉన్న ప్రధాన మార్గాలన్నీ రోడ్లపై వాహనాలు నిండిపోయాయి. ఇక ఉదయం 9గంటల నుంచి శంషాబాద్, బేగంపేట్ ఎయిర్ పోర్టు నుంచి బంజారాహిల్స్ రోడ్ నం. 1లోని తాజ్ కృష్ణా హోటల్‌లో బస ఏర్పాటు చేయడంతో... అక్కడి నుంచి ఎల్బీ స్టేడియం వరకు ఈ రద్దీ కనిపించింది.

## పోలీసులు పకడ్బందీ చర్యలు తీసుకున్నా..

సీఎం ప్రమాణ స్వీకారోత్సవానికి భారీ ఏర్పాట్లు చేశారు. గతంలో రెండు సార్లు జరిగిన ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని పరిమిత సభ్యులు, ప్రముఖులు, ముఖ్య నేతలు, కీలక అధికారుల సమక్షంలోనే జరిగాయి. కానీ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తొలి కార్యక్రమాన్ని హంగు ఆర్భాటాల నడుమ భారీగా మొత్తంలో జనాలను తరలించి నిర్వహించారు. దీంతో రాష్ట్రంలోని ప్రధాన జిల్లాల నుంచి వాహనాల్లో జనాలను తరలించడంతో ఎల్బీ స్టేడియంకు సమీపంలోనే పార్కింగ్ స్థలాలను తాత్కాలికంగా ఏర్పాటు చేశారు. అయితే కార్యకర్తలు, పార్టీ నాయకులు నేరుగా ఎల్బీ స్టేడియం చుట్టూ ఉన్న మార్గాల్లోనే వాహనాలు నిలిపివేయడంతో... పోలీసులు పకడ్బందీ చర్యలు తీసుకున్నప్పటికీ ప్రయోజనం లేకుండా పోయింది.

## వాహనాల రద్దీతో కిక్కిరిసిన రోడ్లు..

జూబ్లీహిల్స్‌లోని సీఎం రేవంత్ రెడ్డి ఇంటి నుంచి మొదలైన వాహన రాకపోకలు ఎల్బీ స్టేడియం నుంచి కోఠి, గాంధీ భవన్ వరకు కొనసాగింది. దీంతో పాటు సోనియాగాంధీ, మల్లికార్జున ఖర్గే, కర్ణాటక సీఎం సిద్దరామయ్య వంటి ప్రముఖులు బంజారాహిల్స్‌లోని రోడ్ నం. 1లోని హోటల్‌లో ఏర్పాటు చేసిన తాత్కాలిక బస కారణంగా... కోర్ సిటీలోనే ట్రాఫిక్ కేంద్రీకృతమైంది. ఇక హోటల్ నుంచి మొదలుకుంటే కోఠి, గాంధీభవన్ వరకు ఉన్న రోడ్లన్నీ వాహనాలతో నిండిపోయాయి. ఇదే సమయంలో ఆఫీసులకు వెళ్లే సమయం కావడంతో ట్రాఫిక్ నియంత్రణలో కొంత మేర ఇబ్బందులు తలెత్తాయి. దీంతో పాటు ప్రముఖ వాహనాలకు రోడ్ క్లియరెన్స్ కారణంగా పంజాగుట్ట, సోమాజిగూడ, ఖైరతాబాద్ చౌరస్తా, లక్డీకాపూర్, రవీంద్రభారతి, టెలిఫోన్ భవన్ సిగ్నల్ వంటి ప్రధాన జంక్షన్ల వద్ద రద్దీ సాయంత్రం 4 గంటల వరకు కొనసాగింది.

## వాహనాల వేగం తగ్గి..

చాలా ప్రాంతాల్లో ప్రముఖ రాకపోకల కంటే ఎక్కువగా సాధారణ కార్యకర్తలు, జిల్లా స్థాయి ముఖ్య నేతల వాహనాలు రావడంతో ట్రాఫిక్‌పై పర్యవేక్షణ కోల్పోయింది. దీంతో ప్రధాన జంక్షన్ల వద్ద ప్రముఖ వాహనాల వేగం తగ్గిపోయింది. రవీంద్రభారతి వరకు వాహన రాకపోకలకు ఎలాంటి ఆటంకాలు ఏర్పడలేదు. కానీ అక్కడి నుంచి ఎల్బీ స్టేడియం చేరుకునే మార్గాన్ని పోలీసులు కూడా నియంత్రించలేకపోయారు. ఓవైపు ప్రముఖుల వాహనాలు, మరోవైపు సిటీ జనాల రాకపోకలతో ట్రాఫిక్ నియంత్రణ కొంత గాడి తప్పింది.



## మరో యుద్ధానికి మాదిగలు సిద్ధం కావాలి

- నేడు మాదిగల భవిష్యత్ కార్యాచరణపై సమావేశం
- వంగపల్లి శ్రీనివాస్ మాదిగ

సిటీబ్యూరో, డిసెంబర్ 7 (నమస్తే తెలంగాణ): ఎస్సీ వర్గీకరణ సాధన దిశగా, మాదిగల హక్కుల సాధనకు, మాదిగల అభివృద్ధి కోసం మరో పోరాటానికి సిద్ధమయ్యేందుకు భవిష్యత్ కార్యాచరణను రూపొందిస్తామని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ మాదిగ తెలిపారు. గురువారం ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వంగపల్లి మాట్లాడుతూ.. యూనివర్సిటీ టెక్నాలజీ ఆడిటోరియంలో నిర్వహించే సమావేశానికి పెద్ద ఎత్తున రాష్ట్ర నాయకత్వం హాజరుకావాలని పేర్కొన్నారు. ప్రస్తుత పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో ఎస్సీ వర్గీకరణ సాధనే లక్ష్యంగా మాదిగలు మరో పోరాటానికి సిద్ధపడ్డారని చెప్పారు. భవిష్యత్ కార్యాచరణ రూపొందించే దిశగా మాదిగలంతా సన్నద్ధం కావాలని వంగపల్లి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. రాష్ట్రంలో అత్యధిక జనాభా కలిగిన మాదిగలకు జనాభా దామాషా ప్రకారం అన్ని రంగాల్లో వాటా కేటాయింపులు జరపాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సంక్షేమ పథకాల్లో సైతం మాదిగలకు మొదటి ప్రాధాన్యత కల్పించి వాళ్ల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలని ఆయన సూచించారు. ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లోనే ఎస్సీ వర్గీకరణ బిల్లు పెట్టాలని ఆయన డిమాండ్ చేశారు. బీజేపీ పార్టీ మాదిగలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో తన చిత్తశుద్ధిని ప్రదర్శించుకోవాలన్నారు. నేడు జరిగే సమావేశానికి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న నాయకత్వం కదిలి రావాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి నాయకులు వరిగడ్డి చందు, జన్నారపు జీవన్, ధర్మారపు శ్రీకాంత్, ఎల్.నాగరాజు, కానుగంటి సురేశ్, మొగిలిపాక కిరణ్, వెంపటి శ్రీకాంత్, కార్తీక్, మణి తదితరులు పాల్గొన్నారు.



## కనువిందు చేయనున్న వీకెండ్ థియేటర్ షో

సిటీబ్యూరో, డిసెంబర్ 7 (నమస్తే తెలంగాణ) : నాటకం సజీవమైనది. అందులోని పాత్రలు కండ్ల ముందే కదలాడుతూంటాయి. ఓ దశలో నవ్విస్తాయి... ఏడ్పిస్తాయి. హృదయాలను బరువెక్కిస్తాయి. బరువు దించుకున్నట్లుగా తేలికపరుస్తాయి. నాటిక ముగిసే సమయానికి ఓ చైతన్యం వీక్షకుడి మెదడులోకి చేరుతుంది. అందుకే నాటికలకు ఎప్పుడూ ఏ నాటికీ సినిమాలు సరితూగవు. థియేటర్ ఫెస్టివల్‌కు హైదరాబాద్‌లో విశేష ఆదరణ ఎప్పుడూ ఉంటుంది. అభిమానుల కోసం ఈ వీకెండ్‌ను నాటకోత్సవంలోకి తీసుకెళ్లేందుకు 'మనం థియేటర్' సిద్ధమైంది. సందేశాత్మక నాటికలతో ఆకట్టుకునేలా థియేటర్ షోలను ప్రదర్శించేందుకు 'మనం థియేటర్ ఫెస్టివల్' ఆధ్వర్యంలో వీకెండ్ థియేటర్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. నేటి నుంచి మరో రెండు రోజుల వరకు ఆసక్తికర థియేటర్ షోలను ప్రదర్శించనున్నారు. హైదరాబాద్ యూనివర్సిటీ విద్యార్థులతో రాజీవ్ వెలిచెటి దర్శకత్వంలో రూపొందిన రెస్ట్ ఆఫ్ ద స్టోరీ శుక్రవారం రాత్రి 7:30గంటలకు గచ్చిబౌలిలోని రంగ్‌భూమి స్పేస్‌లో ప్రదర్శించనున్నారు. ఈ ప్రదర్శన 75 నిమిషాల పాటు సాగనున్నది. ఆదివారం మాదాపూర్‌లోని డిస్ట్రిక్ట్ 150లో సాయంత్రం 4 గంటలు, రాత్రి 7:30గంటలకు 'అఫ్ఘనిస్తాన్ ఈజ్ నాట్ ఫన్నీ'పై నాటిక ప్రదర్శన ఉంటుందని నిర్వాహకులు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మరింత సమాచారం కోసం 7032905332ను సంప్రదించాలని సూచించారు.

## 63 వేల 70 క్వింటాళ్ల ధాన్యం కొనుగోళ్లు

మేడ్చల్, డిసెంబర్7(నమస్తే తెలంగాణ): మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు కొనసాగుతున్నాయి. 12 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయగా ఇప్పటివరకు 63 వేల 70 క్వింటాళ్ల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు జిల్లా పౌరసరఫరాల మేనేజర్ రాజేందర్ తెలిపారు. 15 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందన్న అంచనా మేరకు 12 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కొనుగోలు చేసిన ధాన్యానికి రూ. 10.20 కోట్ల చెల్లింపులు పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. ఏ గ్రేట్ రకానికి మద్దతు ధర క్వింటాల్‌కు రూ. 2203, బీ గ్రేడ్ రకానికి రూ. 2183 రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్నట్లు తెలిపారు.

## నూతన ప్రభుత్వానికి శుభాకాంక్షలు

- తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్

సిటీబ్యూరో, డిసెంబర్ 7 (నమస్తే తెలంగాణ) : రాష్ట్ర ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి, పలువురు మంత్రులుగా ప్రమాణస్వీకారం చేసిన సందర్భంగా తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ హైదరాబాద్ జిల్లా తరపున శుభాకాంక్షలు తెలిపింది. జిల్లా అధికారులందరూ నూతన ప్రభుత్వానికి పూర్తి సహాయ సహకారాలు అందిస్తూ నిబద్ధతతో ప్రజా ప్రభుత్వానికి మరింత మంచిపేరు వచ్చేలా కష్టపడి పనిచేసి ప్రజలకు సంక్షేమ ఫలాలను అందిస్తామని టీజీవో జిల్లా అధ్యక్షుడు ఎంబీ కృష్ణాయాదవ్, కార్యదర్శి ఎంఎ ఖాదర్ ఈ సందర్భంగా తెలిపారు.



మాట్లాడుతున్న ఎంబీ కృష్ణయాదవ్